


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM
www.suryaa.com




వార్

ELECTION SPECIAL 2023



# తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల

## కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల చేసిన ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే

## డేట్‌తో సహా జాబ్ క్యాలెండర్

తెలంగాణ ఎన్నికల వేళ ప్రచారంలో జోరు పెంచడంతో పాటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గే విడుదల చేశారు. సుమారు 42పేజీలతో, 62 అంశాలను ప్రస్తావించారు. గతంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు అనుబంధంగా ఈ ఎన్నికల మ్యానిఫెస్టోను రూపొందించారు. అభయ హస్తం పేరుతో మ్యానిఫెస్టోను రూపకల్పన చేశారు.

తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలైంది. శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే మేనిఫెస్టోను విడుదల చేశారు. మొత్తం 37 అంశాలతో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదలైంది. తమ మేనిఫెస్టో తెలంగాణ ప్రజలకు అంకితమని ఖర్గే స్పష్టం చేశారు. సర్వమతాలకు కాంగ్రెస్ మేనిఫెస్టో హామీ పత్రమని.. హిందువులకు భగవత్ గీత , ముస్లింలకు ఖురాన్, క్రిస్టియన్‌లకు బైబిల్ తమ మేనిఫెస్టో అని ఏఐసీసీ చీఫ్ వెల్లడించారు. దాదాపు 42 పేజీలతో కాంగ్రెస్ మేనిఫెస్టోను రిలీజ్ చేసింది. అలాగే జాబ్ క్యాలెండర్‌ను కూడా హస్తం పార్టీ విడుదల చేసింది. గ్రూప్ -1 ఉద్యోగాల భర్తీ డేట్‌ను కూడా ప్రకటించింది. ఫిబ్రబర్ 1, 2024లో ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది.

తెలంగాణ ఎన్నికల వేళ ప్రచారంలో జోరు పెంచడంతో పాటూ కాంగ్రెస్ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గే విడుదల చేశారు. సుమారు 42పేజీలతో, 62 అంశాలను ప్రస్తావించారు. గతంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు అనుబంధంగా ఈ ఎన్నికల మ్యానిఫెస్టోను రూపొందించారు. అభయ హస్తం పేరుతో మ్యానిఫెస్టోను రూపకల్పన చేశారు. తెలంగాణకు అవసరమైనన్ని అంశాలు ఇందులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పెద్దలు వేణుగోపాల్‌తో పాటూ రేవంత్ రెడ్డి తదితర తెలంగాణ నాయకులు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను గీత, ఖురాన్, బైబిల్‌తో పోల్చారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ సృష్టించబోతోందన్నారు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా ఉంటుందన్నారు.

## కాంగ్రెస్ మేనిఫెస్టో ఇదే..

- నిరుద్యోగ నిర్మూలన
- ఉద్యోగం కల్పించే వరకు రూ.4 వేల నిరుద్యోగ భృతి
- మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- మొదటి ఏడాదిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ
- 18 సంవత్సరాల పైబడి చదువుకునే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు
- ఎస్సీ రిజర్వేషన్ల పెంపు
- ఏబీసీడీ వర్గీకరణ
- బెల్ట్ షాపులు రద్దు
- తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఎంటి స్థలం, గౌరవ భృతి
- వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్.
- 3 లక్షల వడ్డీ లేని పంట రుణం.
- కోతుల నివారణకు ప్రతీ జిల్లాలో స్టెరిలైజ్ కేంద్రం.
- కాళేశ్వరం అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ.
- చెరువుల నిర్వాహణ, మరమ్మతుల బాధ్యత నీటి సంఘాలకు అప్పగింత.
- తొలి క్యాబినెట్‌లో మెగా డీఎస్సీ
- రూరల్ యూత్ ఫైనాన్స్ కార్పోరేషన్‌కు రూ.1000 కోట్ల బడ్జెట్.
- విద్యార్థులకు ఫ్రీ ఇంటర్ నెట్.
- విద్యా రంగానికి బడ్జెట్‌లో 6 నుంచి 15 శాతం వరకు పెంపు.
- ఖమ్మం, ఆదిలాబాద్‌లలో నూతన విశ్వవిద్యాలయాలు.
- వైద్య రంగం బడ్జెట్ రెట్టింపు.
- ధరణి స్థానంలో భూమాత పోర్టల్.
- రేషన్ ద్వారా సన్న బియ్యం , రేషన్ డీలర్‌లకు రూ.5 వేల గౌరవ భృతి.
- కొత్త రేషన్ కార్డులు.
- 200 యూనిట్ల లోపు ఉచిత కరెంటు.
- ఆర్టీసీని ప్రభుత్వంలో వీలీన పక్రియ పూర్తి చేస్తాం.
- ప్రతీ ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం.
- కళ్యాణమస్తు కింద లక్ష రూపాయలతో పాటు 10 గ్రాముల బంగారం.
- మహిళా సంఘాలకు పావులా వడ్డీ రుణాలు.
- జూనియర్ న్యాయవాదులకు మొదటి 5 సంవత్సరాలు నెలకు రూ.5 వేల గౌరవ భృతి.
- 100 కోట్లతో జర్నలిస్ట్‌ల సంక్షేమ నిధి.
- హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో జర్నలిస్టుల ఇళ్ళ సమస్యకు పరిష్కారం.
- ఎన్నారైల సంక్షేమ బోర్డ్ .
- దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్.
- దేవాలయాలకు దూప దీప నైవేద్యం కింద నెలకు రూ.12 వేలు

# మంగళవారం రివ్యూ

బోల్డ్ బ్యూటీ పాయల్ రాజ్ పుత్ ప్రధాన పాత్రలో దర్శకుడు అజయ్ భూపతి దర్శకత్వంలో వచ్చిన సినిమా 'మంగళవారం'. కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదల అయింది. మరి ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో సమీక్షలోకి వెళ్లి తెలుసుకుందాం !

**కథ:** మాహాలక్ష్మీపురంలో గ్రామ దేవత మాలచ్చమ్మకి ఇష్టమైన మంగళవారం రోజునే అక్రమ సంబంధాలు పెట్టుకున్న జంటలు చనిపోతూ ఉంటారు. వారంతా ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆ ఊరి ప్రజలంతా భావిస్తారు. కానీ, ఆ ఊరికి కొత్తగా వచ్చిన ఎస్సై మీనా (నందితా శ్వేత) మాత్రం ఎవరో వారిని హత్య చేశారని అనుమానిస్తోంది. ఇంతకీ వాళ్ళవి ఆత్మహత్యలా ?, లేక హత్యలా ?, ఈ వరుస మరణాల నేపథ్యంలో కొన్నాళ్ళ ముందు ఆ ఊరంతా వేలి వేసిన శైలు... శైలజ (పాయల్) కథ ఏమిటి?, ఈ మధ్యలో రవి పాత్ర ఏమిటి?, అలాగే ఆ ఊరు జమీందారు ప్రకాశం బాబు (చైతన్య కృష్ణ) పాత్ర ఏమిటి?, అసలు ఇంతకీ శైలు కథకు ఇప్పుడు ఊరిలో జరుగుతున్న హత్యలకు సంబంధం ఏమిటి ? అనేది మిగిలిన కథ.

**ప్లస్ పాయింట్స్:** అక్రమ సంబంధాల నేపథ్యంలో వచ్చిన ఈ మర్డర్ మిస్టీరియస్ థ్రిల్లర్ లో కొన్ని హారర్ సన్నివేశాలతో పాటు కొన్ని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ బాగున్నాయి. అలాగే క్లైమాక్స్ ట్విస్ట్ కూడా ఊహకు అందలేదు. దర్శకుడు రాసుకున్న క్రైమ్ డ్రామా కొన్ని చోట్ల ఇంట్రెస్టింగ్ గా సాగింది. ముఖ్యంగా సినిమాలో ట్విస్ట్ లు ఆకట్టుకున్నాయి. నందిత శ్వేత సీరియస్ పోలీస్ అధికారిణిగా ఆకట్టుకున్నారు. కృష్ణ చైతన్య నటన అండ్ మేనరిజమ్ బాగున్నాయి. బోల్డ్ అండ్ లవ్ సన్నివేశాల్లోని పాయల్ రాజ్ పుత్ నటన సినిమాకే హైలైట్ గా నిలిచింది. కథ రీత్యా హీరోయిన్ పాయల్ పాత్రకు అంత పెద్దగా నిడివి లేకున్నప్పటికీ ఆమె తన నటనతో మెప్పించింది. దివ్య పిళ్లై నటన కూడా బాగుంది. అలాగే, అజ్మల్, అజయ్ ఘోష్, రవీంద్ర విజయ్, శ్రావణ్ రెడ్డి తదితరులు తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు అక్రమ సంబంధాల చుట్టూ అనేక కోణాల్లో సినిమాని నడిపిన విధానం కొన్ని చోట్ల బాగుంది.

**మైనస్ పాయింట్స్:** ఈ మంగళవారం సినిమాలో ఇంట్రెస్టింగ్ క్రైమ్ డ్రామా ఉన్నా.. కొన్ని చోట్ల ప్లే చాలా సింపుల్ గా సాగుతుంది. అలాగే బోల్డ్ పాయింట్ అండ్ కంటెంట్ ఉన్నా.. మెయిన్ ప్లాట్ కూడా సింపుల్ గా ఉంది. అదే విధంగా రవి పాత్రలో నటించిన నటుడు కూడా ఆ పాత్రకు పర్ఫెక్ట్ గా సూట్ కాలేదు. మొత్తానికి మేకర్స్ తాము అనుకున్న కంటెంట్ ను స్క్రీన్ మీద బాగా ఎలివేట్ చేసినా.. కొన్ని సీన్స్ విషయంలో అసలు బాగాలేదు. అలాగే, ఫస్ట్ హాఫ్ లో కొన్ని సన్నివేశాలు కూడా ఆకట్టుకోవు. అలాగే సినిమాలో నాటకీయత ఎక్కువడంతో సహజత్వం లోపించింది.

**సాంకేతిక విభాగం:** సాంకేతిక విభాగం గురించి మాట్లాడుకుంటే.. దర్శకుడు అజయ్ భూపతి మంచి క్రైమ్ థ్రిల్లర్స్ కి గుడ్ ట్రీట్మెంట్ ను యాడ్ చేసి ఇంట్రెస్ట్ పెంచలేకపోయారు. హీరోయిన్ ట్రాక్ ఇంకొంచెం బెటర్ గా రాసుకొని ఉండాల్సింది. సినిమాలో సినిమాటోగ్రఫీ బాగుంది. మూవీ ఓపెనింగ్ దృశ్యాలతో పాటు సెకెండ్ హాఫ్ లో వచ్చే కొన్ని కీలక సన్నివేశాలను కెమెరామెన్ చాలా నేచురల్ గా చూపించారు. సంగీతం బాగుంది. నేపథ్య సంగీతం కూడా బాగుంది. ఎడిటింగ్ కూడా ఆకట్టుకుంది. ప్రొడక్షన్ వాల్యూస్ కూడా చాలా బాగున్నాయి.




**తీర్పు:** మంగళవారం అంటూ వచ్చిన ఈ క్రైమ్ మిస్టీరియస్ థ్రిల్లర్ లో.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో పాటు బోల్డ్ సీన్స్ మరియు కొన్ని ఎమోషనల్ మూామెంట్స్ కూడా ఆకట్టుకున్నాయి. అయితే, ఫస్ట్ హాఫ్ లో స్క్రీన్ ప్లే ఇంకా బెటర్ గా ఉండి ఉంటే బాగుండేది. కానీ, సినిమాలో టేకింగ్ అండ్ మేకింగ్ స్టైల్ బాగుంది. మొత్తమ్మీద ఈ క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఓ వర్గం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుంది. కానీ మిగిలిన వర్గాల ప్రేక్షకులకు మాత్రం ఏవరేజ్ అనిపిస్తోంది.



## కేసీఆర్ అన్ని వర్గాలను మోసం చేసిన్రు

### పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని పాలేరు కాంగ్రెస్‌అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు సార్లు కేసీఆర్ ను ముఖ్యమంత్రి ని చేసినా ఇప్పటి వరకు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇళ్ళు, రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడిపోనుందని చెప్పారు. కేసీఆర్‌ను ప్రజలు ఫామ్ హౌస్ కే పరిమితం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12 వేలు ఆర్థికసాయం చేస్తామన్నారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల కరెంటు ఉచితంగా అందిస్తామని చెప్పారు. ప్రతి మహిళకు రూ.2500 అందిస్తామని, గ్యాస్ సిలిండర్ రూ.500కే అందిస్తామని హామీ ఇచ్చారు.

**అక్రమ కేసులు ఎత్తివేస్తాం..**

ఖమ్మం రూరల్ మండలం పరిధిలోని కైకొండాయిగూడెం ఒకటో డివిజన్ కార్పొరేటర్ తేజావత్ హుస్సేన్, సుమారు వెయ్యికి పైగా కుటుంబాలు నాగటి ఉపేందర్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరాయి. వారికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తుమ్మలతో కలిసి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కందాల ఉపేందర్ రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టించిన అక్రమ కేసులను ఎత్తివేయిస్తానని చెప్పారు. ఈ విషయమై తనతోపాటు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు అనేక వేదికలపై కార్యకర్తలకు హామీ ఇచ్చామని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు రాంరెడ్డి చరణ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పువ్వాల దుర్గాప్రసాద్, నాయకుడు బాలసాని లక్ష్మీనారాయణ, కన్నేటి వెంకన్న, బైరు హరినాథ్ బాబు, మద్ది వీరారెడ్డి, బోడ వీరన్న, నాగాటి రాజు, భూక్య ఉపేందర్, శీలం వెంకన్న, సీహెచ్ వీరస్వామి, అక్కిరామయ్య, పందుల శివరాం రామయ్య పాల్గొన్నారు.



## బీసీ లీడరే ముఖ్యమంత్రి

### రఘునందన్ రావు

రాబోయే బీజేపీ ప్రభుత్వంలో బీసీ లీడరే ముఖ్యమంత్రి అవుతాడని ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలిపారు. గురువారం రాయపోల్ మండలంలోని మాంతూర్, చిన్న మాసన్ పల్లి, ఆరేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులతోనే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. త్వరలోనే ఆరేపల్లి గ్రామాన్ని రాయపోల్ మండలంలో విలీనం చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తునక చేస్తామన్న సీఎం కేసీఆర్ కేవలం తన కుటుంబాన్ని మాత్రమే బంగారు మయం చేశారని ఎద్దేవా చేశారు. ముస్లిం మహిళల కోసం త్రిబుల్ తలక్ చట్టాన్ని తెచ్చి వారికి న్యాయం చేసింది బీజేపీ ప్రభుత్వమే అని గుర్తుచేశారు. త్వరలోనే ఎస్సీ వర్గీకరణ కోసం పార్లమెంట్లో బిల్లును పెట్టే యోచలనో ఉందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే వారు మళ్లీ బీఆర్ఎస్‌వారికే అమ్ముడుపోతారన్నారు. కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ నిధుల ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. గ్రామాల్లో వేసే సీసీ రోడ్లు, జీపీ భవనాల నిర్మాణం, రోడ్లు అన్నీ కేంద్ర ప్రభుత్వ నిధులే అని వివరించారు.



## బీఆర్ఎస్‌కు భవిష్యత్ లేదు

### సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

ఈనెల 30 తర్వాత బీఆర్ఎస్ కు భవిష్యత్ లేదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. గురువారం మధిర మండలం రామచంద్రపురం, జాలిముడి, మల్లారం, రొంపి మల్లారం, వంగవీడు, కిష్టాపురం, సిరిపురం, వెంకటాపురం, ఆత్కూరు, నక్కలగరువు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేండ్లలో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఇన్నేండ్లలో భూమి పంచారా? ఇండ్లు ఇచ్చారా? ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. పది సంవత్సరాల బడ్జెట్ తాకట్టు పెట్టి తెచ్చిన రూ.5 లక్షల కోట్ల అప్పు బీఆర్ఎస్ పాలకులు దొరలు కలిసి దోపిడీ చేసి ప్రజలను అన్యాయం చేశారని మండిపడ్డారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వకపోగా ఇందిరమ్మ ఇండ్ల కార్పొరేషన్ ఎత్తివేసిన దుర్మార్గుడు కేసీఆర్ అని దుయ్యబట్టారు. ప్రజల సంపద ప్రజలకు పంచాలని కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ప్రకటించి హామీ పత్రాలపై సంతకాలు పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ పాలనకు ప్రజలు 15 రోజుల్లో చరమగీతం పాడనున్నారని తెలిపారు. ఆగాయ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 100 కుటుంబాలు కాంగ్రెస్ లో చేరాయి.

# ఓటీటీలో వచ్చేసిన
# "టైగర్ నాగేశ్వరరావు".!




మాస్ మహరాజ్ రవితేజ హీరోగా నుపూర్ సనన్ మరియు గాయత్రీ భరద్వాజ్ లు హీరోయిన్స్ గా దర్శకుడు వంశీ తెరకెక్కించిన భారీ చిత్రం "టైగర్ నాగేశ్వరరావు" కోసం తెలిసిందే. మరి రవితేజ కెరీర్ లో మొదటి పాన్ ఇండియా సినిమాగా భారీ బడ్జెట్ తో ఈ సినిమాని తీసుకురాగా డీసెంట్ వసూళ్లను అయతే ఈ చిత్రం అందుకుంది. మరి కొన్ని నిజ జీవిత రూమర్స్ ఆధారంగా ఈ సినిమాని తెరకెక్కించగా సినిమా రిలీజ్ అనంతరం చాలా మంది ఓటీటీ రిలీజ్ కోసం కూడా చూసారు. అయితే ఈ చిత్రం ఇప్పుడు సర్ప్రైజింగ్ గా ఓటీటీలో దర్శనం ఇచ్చింది. మరి ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులు ప్రైమ్ వీడియో వారు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక ఇందులో ఈ చిత్రం ఈరోజు నుంచే స్ట్రీమింగ్ కి వచ్చేసింది. మరి ఈ చిత్రాన్ని ఇప్పుడు ఓటీటీలో చూసి ఎంజాయ్ చేయాలి అనుకునేవారు చూసి ఎంజాయ్ చేయవచ్చు. ఇక ఈ చిత్రంకి జివి ప్రకాష్ సంగీతం అందించగా అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ వారు నిర్మాణం వహించారు.

# వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ కు మోదీ




వరల్డ్ కప్ చివరి యుద్ధం.. నవంబర్ 19వ తేదీ ఆదివారం.. మధ్యాహ్నం ప్రారంభం కాబోతుంది. ఫైనల్ మ్యాచ్ ఇండియా ఆడుతుండటంతో.. దేశం మొత్తం ఇప్పుడు గుజరాత్ వైపు చూస్తుంది. దీనికి కారణం.. నరేంద్ర మోడీ స్టేడియంలో మ్యాచ్ జరగటమే.. ఈ ఫైనల్ మ్యాచ్ కు మరో ఎట్రాక్షన్ కూడా ఉంది.. ప్రధాని మోదీ హాజరవుతున్నారు.. మ్యాచ్ మొత్తం చూడనున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చింది. వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ కు మోదీ హాజరు అవుతుండటంతో.. క్రికెట్ అభిమానులే కాదు.. అన్ని రాజకీయ పార్టీల చూపు ఇప్పుడు అటువైపు మళ్లింది. అందులోనూ ఆదివారం కావటంతో మరింత హైప్ క్రియేట్ అవుతుంది. ప్రధాని మోదీతోపాటు బాలీవుడ్ సెలబ్రిటీలు, ప్రముఖ రాజకీయ నాయకులు సైతం ఈ మ్యాచ్ కు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. క్రికెట్ మ్యాచ్ కు మోదీ హాజరుకావటం ఇది రెండో సారి. బోర్డర్ గవాస్కర్ సిరీస్ లో భాగంగా ఇండియా, ఆస్ట్రేలియా టెస్ట్ మ్యాచ్ కు హాజరయ్యారు మోదీ. అది కూడా ఇదే స్టేడియంలో కావటం విశేషం. ఇప్పుడు వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ మొత్తాన్ని చూడనున్నారు మోదీ.

# జగన్ ఎక్కడుంటే అక్కడ కరువు: లోకేశ్

సీఎం జగన్ పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. జగన్-కరవు కవల పిల్లలు అని అన్నారు. జగన్ ఎక్కడుంటే కరవు అక్కడుంటుందని ఎద్దేవా చేశారు. వీరిద్దరిది విడదీయలేని బంధం అన్నారు. రైతులను నిర్లక్ష్యం చేసిన జగన్ పనైపోయిందన్నారు. కాగా విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.1,650 కోట్లు తక్షణమే విడుదల చేయాలంటూ లోకేశ్ సీఎం జగన్ కు లేఖ రాశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దన్నారు.



నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



# మృణాల్ అందాలు అదరహో

హృదయాలు తగలబెట్టే విధంగా మృణాల్ భారీ పరువాలతో హోరెత్తిస్తోంది.సీతారామం చిత్రంలో సర్ప్రైజింగ్ పెర్ఫామెన్స్, అందంతో ఒక్కసారిగా మృణాల్ ఠాకూర్ క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. మృణాల్ ఠాకూర్ అందానికి, నటనకి ప్రతి ఒక్కరూ ఫిదా అవుతున్నారు. నార్త్ బ్యూటీ అయినప్పటికీ తెలుగు అమ్మాయిలాగా ఆమె చీర, లంగాఓణీలో మైమరపించింది. త్వరలో మృణాల్ ఠాకూర్ టాలీవుడ్ లో భారీ ఆఫర్స్ అందుకోబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. స్టార్ హీరోల చిత్రాలకు ఆమె ఛాయిస్ గా మారుతోంది. అంతలా సీతా రామం చిత్రంలో ప్రేక్షకుల హృదయాలు దోచుకుంది ఈ యంగ్ బ్యూటీ. చూపు తిప్పుకోలేని అందం ఒకెత్తయితే.. ప్రిన్సెస్ నూర్జహాన్ గా ఆమె పెర్ఫామెన్స్ మరో ఎత్తు. అవసరమైనప్పుడు చిలిపిగా, హుందాగా నటించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తింది.





## సెమీస్‌లో 3 వికెట్ల తేడాతో
# సౌతాఫ్రికాపై గెలుపు




2023 వన్డే ప్రపంచకప్‌ను సాధించడానికి రోహిత్‌సేన కష్టపడాల్సిందే. అయిదుసార్లు ఛాంపియన్, 2003లో టీమ్‌ఇండియాకు పీడకలను మిగిల్చిన ఆస్ట్రేలియానే మరోసారి మన ఫైనల్ ప్రత్యర్థి కానుంది. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో ఆసక్తికరంగా సాగిన సెమీఫైనల్లో కంగారూ జట్టు 3 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట మిచెల్ స్టార్క్ (3/34), హేజిల్‌వుడ్ (2/12), ట్రావిస్ హెడ్ (2/21), కమిన్స్ (3/51)ల ధాటికి దక్షిణాఫ్రికా 49.4 ఓవర్లలో 212 పరుగులకే ఆలౌటైంది. ప్రతికూల పరిస్థితుల్లో డేవిడ్ మిల్లర్ (101; 116 బంతుల్లో 8x4, 5x6) అద్భుత శతకం సాధించాడు. క్లాసెన్ (47; 48 బంతుల్లో 4x4, 2x6) కూడా పోరాడాడు. అనంతరం స్పిన్నర్లు షంసి (2/42), కేశవ్ మహరాజ్ (1/24), మార్‌క్రమ్ (1/23)ల ధాటికి ఛేదనలో ఆసీస్ కూడా తడబడింది. కానీ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' హెడ్ (62; 48 బంతుల్లో 9x4, 2x6) విధ్వంసక ఇన్నింగ్స్‌కు వార్నర్ (29), స్మిత్ (30), ఇంగ్లిస్ (28), స్టార్క్ (16 నాటౌట్), కమిన్స్ (14 నాటౌట్)ల పోరాటం తోడవడంతో ఆసీస్ గట్టెక్కింది. ఆ జట్టు 47.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

అలవోకగా అనుకుంటే..: మొదట దక్షిణాఫ్రికాకు ఎంత పేలవ ఆరంభం లభించిందో.. ఛేదనలో ఆసీస్ అంత మంచి ఆరంభాన్నిచ్చారు హెడ్, వార్నర్. చిన్న లక్ష్యమని ఆచితూచి ఆడే ప్రయత్నం చేస్తే ఒత్తిడి పెరుగుతుందన్న ఉద్దేశంతో ఈ ఇద్దరూ ధాటిగా ఆడి దక్షిణాఫ్రికాను పోటీలో లేకుండా చేయాలని ప్రయత్నించారు. వార్నర్, హెడ్ పోటీపడి షాట్లు ఆడటంతో 6 ఓవర్లకే 60 పరుగులు చేసింది ఆసీస్. ఆ జట్టు ఊపు చూస్తే సగం ఓవర్లలోనే అలవోకగా ఛేదన పూర్తి చేస్తుందనిపించింది. కానీ పేసర్లు తేలిపోవడంతో స్పిన్నర్ మార్‌క్రమ్ చేతికి బవుమా బంతినప్పగించగా.. అతను తొలి బంతికే వార్నర్‌ను బౌల్డ్ చేశాడు. తర్వాతి ఓవర్లో మార్ష్ (0)ను ఔట్ చేయడంతో మ్యాచ్ ఒక్కసారిగా ఆసక్తికరంగా మారింది. అయితే హెడ్.. దక్షిణాఫ్రికాకు మరింత పట్టు బిగించే అవకాశం ఇవ్వలేదు. ధనాధన్ బ్యాటింగ్‌ను కొనసాగించి లక్ష్యాన్ని కరిగించాడు. ఆసీస్ 11 ఓవర్లకు 77/2తో ఉన్న దశలో కొయెట్జీ బౌలింగ్‌లో హెడ్ ఇచ్చిన క్యాచ్‌ను హెండ్రిక్స్ వదిలేయడం దక్షిణాఫ్రికాను దెబ్బ తీసింది. ఈ ఓవర్లో అతను మూడు ఫోర్లు కొట్టాడు. 15వ ఓవర్లో హెడ్‌ను కేశవ్ బౌల్డ్ చేసేటప్పటికే సగం లక్ష్యం కరిగిపోయింది. అయినా ఆశలు కోల్పోకుండా దక్షిణాఫ్రికా పోరాడింది. స్పిన్‌కు బాగా అనుకూలిస్తున్న పిచ్‌ను ఉపయోగించుకుంటూ షంసి, కేశవ్.. స్మిత్, లబుషేన్ (18)లపై ఒత్తిడి పెంచారు. పరుగుల వేగం పడిపోగా.. లబుషేన్, మ్యాక్స్‌వెల్ (1)లను వరుస ఓవర్లలో ఔట్ చేసిన షంసి దక్షిణాఫ్రికాలో ఆశలు రేపాడు. 12 ఓవర్ల వ్యవధిలో 44 పరుగులే చేసిన ఆసీస్.. 2 వికెట్లు కోల్పోయింది. మ్యాచ్ ఎటైనా మొగ్గేలా కనిపించిన దశలో స్మిత్.. ఇంగ్లిస్ సంయమనంతో ఆడి పరుగులు కూడ గట్టారు. 17 ఓవర్లలో 39 పరుగులతో సమీకరణం తేలికైంది. ఈ దశలో స్మిత్‌ను, ఇంగ్లిస్‌ను కొయెట్జీ ఔట్ చేసినా.. స్టార్క్, కమిన్స్ పట్టుదలతో నిలిచి జట్టును గెలిపించారు.




మిల్లర్ అద్భుత పోరాటం: మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే.. ఆ జట్టు 213 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడం అనూహ్యమే! ఘోరమైన ఆరంభంతో సెమీస్ మీద ఆరంభంలోనే ఆశలు కోల్పోయినట్లు కనిపించింది సఫారీ జట్టు. పేస్‌కు అనుకూలిస్తున్న పరిస్థితుల్లో స్టార్క్, హేజిల్‌వుడ్ చెలరేగిపోవడంతో తొలి 12 ఓవర్లలో కేవలం 28 పరుగులే చేసి 4 ప్రధాన వికెట్లు కోల్పోయింది దక్షిణాఫ్రికా. పేలవ ఫామ్‌తో జట్టుకు గుదిబండలా మారిన కెప్టెన్ బవుమా (0) మరోసారి విఫలం కాగా.. ఫామ్‌లో ఉన్న డికాక్ (3) కూడా ఎంతోసేపు నిలవలేదు. వాండర్‌డసెన్ (6), మార్‌క్రమ్ (10) లాంటి స్టార్ బ్యాటర్లు కూడా విఫలమవడంతో దక్షిణాఫ్రికా పీకల్లోతు కష్టాల్లో పడింది. పరుగులు చేయడం, వికెట్ కాపాడుకోవడం చాలా కష్టంగా మారిన పరిస్థితుల్లో మిల్లర్.. క్లాసెన్ జంట ఎంతో పట్టుదలతో నిలిచింది. కుదురుకున్నాక వీళ్లిద్దరూ బ్యాట్లు ఝుళిపించారు. వీరి భాగస్వామ్యం వందకు చేరువ కాగా.. స్కోరు 30 ఓవర్లకు 111/4 చేరుకోవడంతో ఇన్నింగ్స్ గాడిన పడ్డట్లే కనిపించింది. ఆ దశలో దక్షిణాఫ్రికా 250 పైచిలుకు స్కోరు చేసేలా కనిపించింది. కానీ పార్ట్ టైం స్పిన్నర్ హెడ్ వరుస బంతుల్లో క్లాసెన్, జాన్సన్ (0)లను ఔట్ చేసి సఫారీ జట్టును గట్టి దెబ్బ తీశాడు. అయినా మిల్లర్ అద్భుత పోరాటం ఆగలేదు. కొయెట్జీ (19) అండతో అతను ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 174/6తో దక్షిణాఫ్రికా మళ్లీ పుంజుకుంది. కొయెట్జీ ఔటయ్యాక సహకారం లేకపోయినా మిల్లర్ పోరాడుతూ సెంచరీ చేశాడు. స్కోరునూ 200 దాటించాడు. దక్షిణాఫ్రికా 230 చేరుతుందనిపించింది. కానీ వెంటనే మిల్లర్ ఔటైపోవడంతో ఆ జట్టు అనుకున్నదానికంటే తక్కువ స్కోరే చేసింది.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: డికాక్ (సి) కమిన్స్ (బి) హేజిల్‌వుడ్ 3; బవుమా (సి) ఇంగ్లిస్ (బి) స్టార్క్ 0; వాండర్‌డసెన్ (సి) స్మిత్ (బి) హేజిల్‌వుడ్ 6; మార్‌క్రమ్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 10; క్లాసెన్ (బి) హెడ్ 47; మిల్లర్ (సి) హెడ్ (బి) కమిన్స్ 101; జాన్సన్ ఎల్బీ (బి) హెడ్ 0; కొయెట్జీ (సి) ఇంగ్లిస్ (బి) కమిన్స్ 19; కేశవ్ మహరాజ్ (సి) స్మిత్ (బి) స్టార్క్ 4; రబాడ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కమిన్స్ 10; షంసి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 11 మొత్తం: (49.4 ఓవర్లలో ఆలౌట్) 212; వికెట్ల పతనం: 1-1, 2-8, 3-22, 4-24, 5-119, 6-119, 7-172, 8-191, 9-203; బౌలింగ్: స్టార్క్ 10-1-34-3; హేజిల్‌వుడ్ 8-3-12-2; కమిన్స్ 9.4-0-51-3; జంపా 7-0-55-0; మ్యాక్స్‌వెల్ 10-0-35-0; హెడ్ 5-0-21-2

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (బి) కేశవ్ 62; వార్నర్ (బి) మార్‌క్రమ్ 29; మార్ష్ (సి) వాండర్‌డసెన్ (బి) రబాడ 0; స్టీవ్ స్మిత్ (సి) డికాక్ (బి) కొయెట్జీ 30; లబుషేన్ ఎల్బీ (బి) షంసి 18; మ్యాక్స్‌వెల్ (బి) షంసి 1; ఇంగ్లిస్ (బి) కొయెట్జీ 28; స్టార్క్ నాటౌట్ 16; కమిన్స్ నాటౌట్ 14; ఎక్స్‌ట్రాలు 17 మొత్తం: (47.2 ఓవర్లలో 7 వికెట్లకు) 215; వికెట్ల పతనం: 1-60, 2-61, 3-106, 4-133, 5-137, 6-174, 7-193; బౌలింగ్: జాన్సన్ 4.2-0-35-0; రబాడ 6-0-41-1; మార్‌క్రమ్ 8-1-23-1; కొయెట్జీ 9-0-47-2; షంసి 10-0-42-2; కేశవ్ మహరాజ్ 10-0-24-1

# బీఆర్ఎస్ నేతలకు గుర్తుల గుబులు..



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్ కి గుర్తుల భయం పట్టుకుంది. ఎన్నికల అధికారులు స్వతంత్ర అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు బీఆర్ఎస్ లో గుబులు పుట్టిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న చిన్న రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు రంగారెడ్డి జిల్లా అధికారులు గుర్తులు ఇచ్చారు. వీటి కోసం ఓటర్లు ఈజీగా గుర్తించుకునేలా, నిరక్షరాసులు కూడా తేలికగా తమ ఓటు హక్కును వేసేలా గుర్తులు కేటాయించారు. అయితే, మనం నిత్యం వినియోగించే వస్తువులు, పరికరాలు, యంత్రాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రెషర్ కుక్కర్, కంప్యూటర్, లాప్ టాప్, గ్యాస్ స్టవ్, టీవీ రిమోట్, గ్యాస్ సిలిండర్, బాల్, పల్లకి, బ్యాట్, హాకీ స్టిక్, ఉంగరం, గాజులు, ఆపిల్, కెమెరా, ఐస్ క్రీమ్, టార్చ్ లైట్, పెట్రోల్ పంప్, కత్తెర, మైక్, టూత్ పేస్ట్, పండ్ల బుట్ట, క్యారం బోర్డ్, కుట్టు మిషన్, కుండలతో పాటు జనసేన గుర్తు గాజు గ్లాసును కూడా స్వతంత్ర అభ్యర్థులకు ఇచ్చింది.

ఇక, గత ఐదేళ్లుగా బీఆర్ఎస్ లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో చపాతీ కర్ర, రోడ్డు రోలర్ వంటి గుర్తులు తమ పార్టీ గుర్తును పోలి ఉన్నాయని.. దీని వల్ల ఓటర్లను గందరగోళంలో పడేసి ఓట్లు చీలేలా చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ గుర్తులను స్వతంత్రులకు, ఇతర పార్టీలకు కేటాయించొద్దని కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కానీ, బీఆర్ఎస్ ఫిర్యాదును ఎన్నికల సంఘం కొట్టివేయడంతో సుప్రీంకోర్టుకు కూడా వెళ్లారు.. దీనిపై విచారణ చేసిన సుప్రీంకోర్టు.. చపాతి కర్ర, రోడ్డు రోలర్ గుర్తులను కేటాయించ వద్దు అని చెప్పలేమంటూ ఈ అక్టోబర్ లో తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే యుగ తులసి పార్టీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని.. తమకు రోడ్డు రోలర్ గుర్తు కేటాయించాలని కోరింది. వారి వినతులను పరిశీలించిన తర్వాత ఎన్నికల్లో పోటీలో ఉన్న చోట ఈ గుర్తును ఇస్తాం.. యుగ తులసి పార్టీ పోటీలో లేని చోట వేరే వారికి కేటాయిస్తామ ఈసీ వెల్లడించింది. ఇక, యుగ తులసి పార్టీ అభ్యర్థులు ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, శేరిలింగంపల్లి, కల్వకుర్తి నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు. వీరికి ఇక్కడ రోడ్డు రోలర్ గుర్తును ఈసీ కేటాయించింది. మరోవైపు రోడ్డు రోలర్ గుర్తును రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న మహమ్మద్ అబ్దుల్ అజీజ్ కు, స్వతంత్ర అభ్యర్థులుగా షాద్ నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో పోటీకి దిగుతున్న నరసింహ, తుడుము పాండులకు కేటాయించింది.

# ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ



ఢిల్లీ నగరంలో వాయు కాలుష్యం రోజు రోజుకు పెరుగుతుండటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇవాళ ఉదయం ప్రమాదకర స్థితికి వాయు కాలుష్యం చేరింది. గాలి నాణ్యత తీవ్ర స్థాయిలో పెరుగుతుండటంతో ఆరోగ్య నిపుణులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీలోని పలు ప్రదేశాలు 400 కంటే ఎక్కువ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) నమోదు అయింది. ఆనంద్ విహార్ లో అత్యధికంగా AQI 447 వద్ద నమోదు అయింది. ఆ తర్వాత ఆర్కే పురం 467, ఐజీఐ విమానాశ్రయం 467, ద్వారక 490 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ సూచికలు నమోదు అయ్యాయి. ఇక, నిరంతరంగా అధిక స్థాయిలో వాయు కాలుష్యం పెరిగిపోతుంది. CPCB వెబ్‌సైట్ నోయిడా యొక్క AQIని 352గా సూచించింది. అయితే గ్రేటర్ నోయిడాలోని నాలెడ్జ్ పార్క్-III AQI 314గా ఉంది. హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌లో, సెక్టార్ 51లో ఉదయం 5 గంటలకు AQI 444గా నమోదు అయింది. ప్రశాంతమైన గాలులు, శీతల ఉష్ణోగ్రతల వల్ల కాలుష్య కారకాలు పేరుకుపోవడానికి కారణమం అవుతున్నాయి, మరి కొన్ని రోజుల పాటు ఎలాంటి ఉపశమనాన్ని పొందలేదమని వాతావరణ వాఖ అధికారులు తెలిపారు. అయితే, నవంబర్ 21 నుండి గాలి వేగం మెరుగుపడటం వల్ల వాయు కాలుష్య స్థాయిలు తగ్గుతాయని అవకాశం ఉందని ఐఎండీ వివరించింది. ఇక, నిర్మాణాలు, డీజిల్ తో నడిచే వాహనాలను నగరంలోకి ప్రవేశించకుండా ఢిల్లీ ప్రభుత్వం నిషేధించింది.



# వివాదంలో సీఎం సిద్ధరామయ్య కొడుకు

కర్నాటక సీఎం సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర వివాదంలో చిక్కుకున్నారు. ఆయన తన తండ్రితో మాట్లాడిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. జేడీఎస్ లీడర్ కుమారస్వామి ఆ వీడియోను గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేసి.. యతీంద్రపై అవినీతి ఆరోపణలు చేశారు. సిద్ధరామయ్యతో యతీంద్ర ఫోన్ లో మాట్లాడుతూ.. "హలో అప్పా.. వివేకానంద ఎక్కడిది? నేను ఆ పేరు ఇవ్వలేదు కదా? నేను నాలుగైదు పేర్లే ఇచ్చాను. అవి మాత్రమే చేయండి' అని అన్నట్టుగా ఉంది. అయితే ఏ అంశానికి సంబంధించి సిద్ధరామయ్యతో యతీంద్ర మాట్లాడారనేది క్లారిటీ లేదు. ఈ వీడియోను ట్విట్టర్ లో పోస్టు చేసిన కుమారస్వామి.. అధికారుల బదిలీల కోసం యతీంద్ర లంచం తీసుకున్నారని ఆరోపించారు.




# జీవోలపై జగన్ సర్కార్ ఉత్తర్వులు

ఆన్ లైన్ జీవోలపై ఏపీ ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. జీవోల వివరాలను తప్పనిసరిగా వెబ్ సైట్ లో పెట్టాలని అన్ని శాఖలకు ప్రభుత్వం ఆదేశించింది. 2022 ఫిబ్రవరి 1 నుంచి విడుదలైన జీవోలకు సంబంధించి ఆన్ లైన్ అప్లోడ్ చేసిన వివరాలను అందించాలని అన్ని శాఖల ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ శాఖలు తీసుకునే నిర్ణయాలను, జారీ చేసే ఉత్తర్వులను ఎప్పటికప్పుడు వెబ్ సైట్లో అప్ లోడ్ చేయాలని సూచించింది.